# కంచికి వెళ్లొచ్చిన కథ



"ఒరేయ్... గణపతీ! ఈరోజు వంట చేయడం నావల్లకాదురా. ఈ ఒక్క రోజైనా హాయిగా ఊరిమీద పడి తిని వద్దాం రా!" అన్నాడు సుబ్బారాయుడు దీనంగా ముఖంపెట్టి.

"ఏం పాపం... సుబ్బారాయుడి చూపు బిమ్మిలి, చలిమిడి మీదికి మళ్లిందా ఏమిటి? ఇవాళేమీ సుబ్బారాయుడి షష్ఠికాదే!" అన్నాడు గణపతి చిలిపిగా నవ్వుతూ.

"అఘోరించావు... ఈ పండగ నీది. మీవాళ్ళు బాగా ఆలోచించే నీకు పేరు పెట్టారు. రూపం కాస్త అటూ ఇటూగా వినాయకుడికి డూప్‌లాగా చక్కగా సరిపోతుంది. నా మాట

విని ఈరోజు ఒక్కడివీ బయటకు వెళ్లకు. జనం నిన్ను చూశారంటే సాక్షాత్తూ మొబైల్ వినాయకుడే కైలాసం నుంచి దిగి వచ్చాడనుకొని నిన్ను పట్టి ఈ తొమ్మిది రోజులూ పందిట్లో కూచోబెట్టేయగలరు.., తర్వాత చెరువులో ముంచేయగలరు. అందుకే ఈ పదిరోజులూ నేను నీకు బాడీగార్డులాగా నీ వెంటనే అంటే ఉంటాను" అన్నాడు సుబ్బారాయుడు గణపతిని కవ్విస్తూ.

"పేరులో ఏముంది? ఎవరికో కాని పేరుకీ, రూపానికీ పొంతన ఉండదు. నీ పేరు సుబ్బారాయుడని నువ్వేమైనా సన్నగా, పొడుగ్గా, పొట్లకాయలాగా, త్రాచుపాములా ఉన్నావా ఏమిటి? బాన కడుపు, బుంగ మొహంతో, నీటి వంకాయలాగా, ఏనుగు గున్నవలె ఉంటావు. నన్నడిగితే వినాయకుడి రూపం నీకు చక్కగా సరిపోతుంది."

"నిన్నెవరూ అడగరులే కాని, ఈరోజు ఇంటి వంట చేయడం నావల్ల కాదు."

"ఒంట్లో బాగుండలేదా? పోనీలే.., దానికింత హడావుడి ఎందుకు? ఈరోజు నేనే వంట చేస్తాలే. ఓరోజు నువ్వు, ఓరోజు నేను- లేదా ఓపూట నువ్వు, ఓపూట నేను ఎప్పుడూ చేసుకుంటున్నదేగా... నిన్న నేను చేశాను. అయినా పర్వాలేదు. ఈరోజు నేనే చేస్తాను. రేపు, ఎల్లుండి నువ్వే చేద్దువు- సరిపోతుంది."

"పండగనాడు కూడా పాత మొగుడేనా... అని నీ చేతి వంటా, నా చేతి వంటా తిని జిహ్వ చచ్చిపోయింది. అందుచేత పండుగ పేరు చెప్పుకుని ఈరోజు బయట తినివద్దాం. పండగనాడు హోటళ్లలో స్వీటూ, హాటు కూడా భోజనంతోపాటు పెట్టారు. ఎక్స్ట్రా ఖర్చు లేకుండా విందుభోజనం చేసినట్టుంటుంది."

"ఐడియా బాగానే ఉంది కాని, నువ్వేమో అసలే సుబ్బారాయుడివి. నేను గణపతిని. మనం వచ్చామని స్వీట్ కింద చలిమిడిని, హాట్ క్రింద ఉండ్రాన్ని పెట్టారనుకో- అప్పుడు..."

"చాల్లే... నీకుశ్శంకలూ, లఘుశంకలూను! ఈనాడు ప్రొద్దున టిఫిన్ దగ్గర్నుంచి రాత్రి భోజనం వరకూ అంతా బయటనే! ఇంతకీ నువ్వు వస్తున్నావా... నన్ను పొమ్మంటావా?" అంటూ బెదిరించాడు సుబ్బారాయుడు.

"వస్తున్నా నాయనా... ఏక్ రూం వాసం చేస్తున్నాక నీతో సహగమనం చెయ్యక తప్పుతుందా?" అంటూ బట్టలు మార్చుకోవడానికి వెళ్లాడు గణపతి.

* * *

మిత్రులిద్దరూ ఊరి మీద పడ్డారు. కొంచెం దూరంలోనే ఇడ్లీ హోటల్ ఉంది. దాని అసలు పేరు ఏమో కాని, ఇడ్లీ హోటల్ అంటే మాత్రం అందరికీ తెలుసు. అక్కడి ఇడ్లీ మహా ప్రత్యేకంగా, అమిత రుచిగా ఉంటుందట.

ఇడ్లీ రుచి అంటే ఇడ్లీదని కాదు. దానితోపాటు ఇచ్చే చట్నీది. ఆ చట్నీ తీరే వేరు. ఆ రుచే వేరు. తెల్లగా, మెత్తగా వెన్నముద్దలా ఉండే ఇడ్లీకి, లేత పసుపు రంగులో గట్టిగా ఉండే ఆ చట్నీ కలిపినప్పుడు ఆ కాంబినేషన్ కాంబినేషనే! "ఓహ్... ఏం రుచి?" అంటూ ఎగబడి తింటున్నారు జనం.

మొదట్లో ఒక చిన్నగదిలో ప్రారంభమైన ఆ హోటల్ త్వరలోనే అదే ఇంటిలో, రేకులు విచ్చుకుంటున్న మొగ్గలాగా, మరో రెండు హాల్స్‌కి విస్తరించింది. సొంతంగా సర్వ్ చేస్తూ నోటిలెక్కన డబ్బులు తీసుకుంటుండిన ప్రొప్రయిటర్ బల్ల ముందు కుర్చీలో గుమ్మడికాయలాగా కదలకుండా కూర్చుని సర్వర్లు రాసి ఇచ్చే బిల్స్ వసూలు చేసుకునే స్థాయికి ఎదిగాడు.

ఆ రెండున్నర హాల్స్ విస్తీర్ణం సరిపోక ఇడ్లీప్రియులు నిలబడే లాగించేస్తుంటారు.

ఆ ఇడ్లీ హోటల్‌ని సమీపిస్తుండగానే సుబ్బారాయుడికి నోరూరింది. వెచ్చని ఉమ్మి చెలమనుంచి ఊరే ఊటనీరులాగా పైకి తన్నుకు వచ్చింది.

చెప్పొద్దూ... గణపతికి కూడా నోరూరింది. ఇద్దరూ ఉత్సాహంగా హోటల్‌లోకి అడుగుపెట్టారు.

ఆరోజు వినాయకచవితి కావడంవల్ల కాబోలు- హోటల్లో జనం ఎక్కువమంది లేరు. బట్టతల మీద అక్కడక్కడ మొలిచిన వెంట్రుక పరకల్లాగా, పలుచగా కూర్చుని ఉన్నారు.

"జనం అంతా పూజా పునస్కారాల హడావుడిలో ఇళ్లకీ, మార్కెట్లకీ అంటుకుపోయి ఉన్నట్లున్నారు. హాయిగా మఠం వేసుకు మరీ కూర్చుని తీరిగ్గా తిందాం రా!" అంటూ ముందుకి అడుగువేశాడు సుబ్బారాయుడు.

ఇద్దరూ బల్లలమీద ఎదురూ బదురుగా కూర్చున్నారు.

ఆ హోటల్లోకి వచ్చేవారు విధిగా ఇడ్లీ తినడం ఆనవాయితీ కనుక కోరనిదే వరాలిచ్చినట్లు, జగన్మోహిని అమృతభాండాన్ని తీసుకువచ్చినట్లు, అడక్కుండానే చెరో చేత్తో ఇడ్లీ ప్లేట్లు తీసుకుని సుందరవదనం కాకపోయినా- మందహాసంతో, మౌనముద్రతో వచ్చాడు సర్వారాయుడు.

అతని చేతుల్లోని ఇడ్లీ ప్లేట్లను చూస్తూ రాహుకేతువుల్లాగా నాలుకతో పెదవులు తడుపుకోసాగారు మిత్రులిద్దరూ.

చిరునవ్వులు చిందిస్తూ సర్వారాయుడు ఇడ్లీప్లేట్లను వాళ్ళముందు పెట్టి ఏమంటారో అన్నట్లు ఒక్కక్షణం ముఖాలవంక చూస్తూ నిలబడ్డాడు.

వాళ్ళు ఏమీ అనకపోయేసరికి, మౌనాన్నే అంగీకారంగా తీసుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ వెళ్లిపోయాడు.

సర్వారాయుడు అలా వెళ్లాడో, లేదో... క్లీనర్ అండ్ సప్లయర్ ఇన్ అయిన చిన్నా వచ్చాడు- మంచినీళ్ల గ్లాసులతో. ఆ పట్టుకోవడం సర్కస్‌లో ఫీట్లు చేస్తున్నట్లు ఇటో ఐదు గ్లాసులు, అటో ఐదు గ్లాసులలో వేళ్ళు పూర్తిగా ముంచి గ్లాసుల్ని గట్టిగా పట్టుకుతెచ్చాడు.

ఆ విన్యాసం చూసేసరికి మిత్రులిద్దరికీ కడుపులో దేవినట్లయింది. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

ఇవేవీ తనకి పట్టనట్లు ఓ ఐదు గ్లాసుల్ని వాళ్ళ బల్లమీద పెట్టి, మిగిలిన ఐదు గ్లాసులతో మరో బల్లవైపు వెళ్లిపోయాడు ఆ నిక్కరుధారి.

చిన్న బల్లమీద నీళ్లగ్లాసులు పెడ్తుంటే అప్రయత్నంగా వాడి వేళ్లవంక చూశాడు గణపతి.

కడుపులోనుంచి వాంతి తన్నుకువచ్చినట్లయింది. వాడి వేళ్ల మధ్య చర్మం నిత్యం నీళ్లతో నాని ఉండటంతో ఒరుసుకుపోయి తెల్లగా తయారైంది.

గణపతి ముఖకవళికలు చూస్తూంటే సుబ్బారాయుడికి నవ్వు వచ్చింది.

"వాడి వేళ్ళు చూశావా... ఎలా పాచిపట్టి ఉన్నాయో!" అన్నాడు గణపతి.

"ఏమో... నేను చూడలేదు" అన్నాడు సుబ్బారాయుడు.

ఇంతలో... చిన్నా ఆ బల్ల దగ్గరికి మళ్లీ వచ్చి త్రాగేసిన గ్లాసులలో మళ్లీ వేళ్లు ముంచి వాటిని తీసుకుపోయాడు.

ఈసారి ప్రత్యేకంగా వాడి వేళ్లవంక చూశాడు సుబ్బారాయుడు.

అతనికి నిజంగా వాంతి వచ్చినట్లయింది. వాడి వేళ్లకి పాచిపట్టడం ఒకటేకాదు.., వాటి మీద గజ్జి కురుపులు కూడాను. గణపతి కూడా వాటిని గమనించాడు.

"ఒరేయ్... ఇక్కడ మనం తినలేం! మరో చోటికి పోదాం... పద!" అంటూ సగం లేచాడు గణపతి.

"వాడు ఇక్కడ ఇడ్లీలు పెట్టి చచ్చాడు. ఇప్పుడు ఎలా వెళ్లడం..?" అంటూ గునవసాగాడు సుబ్బారాయుడు.

"ఒరేయ్... అటుచూడు- ల్యూనటిక్ వస్తున్నాడు. అదుగో... మనల్ని కూడా చూశాడు" అన్నాడు గణపతి.

"ల్యూనటిక్కా? ఎవర్రా వాడు?" అంటూ అటు చూశాడు.

లూనాను ఆపి లాక్ చేస్తూ కనిపించాడు రాజారావు.

"లూనా ఉంటే ల్యూనటిక్కేనా ఏమిటి? బాగుంది... నీ కొత్త నిర్వచనాన్ని నిఘంటువులోకి ఎక్కించవలసిందే!" అంటూ నవ్వాడు సుబ్బారాయుడు.

రాజారావు రాక వాళ్ళని మళ్లీ మామూలు మూడ్‌లోకి తెచ్చింది.

"హలో సుబ్బూ... హలో గణపతీ..." అంటూ వచ్చి హ్యాండ్‌బ్యాగ్‌ని ఒక కుర్చీలో పెట్టి చేతులు కడుక్కోవడానికి వాష్‌బేసిన్ వైపు వెళ్లాడు.

"ఏరా... ఇడ్లీ తిందామా?" అన్నాడు గణపతి.

"కానీ... తప్పదు. మంచినీళ్లు తాగకుండా ఉంటేసరి!" అన్నాడు రాయుడు.

"ఏంచేస్తాం... సర్వం జగన్నాథం!" అన్నాడు గణపతి.

రాజారావు వచ్చి సుబ్బారాయుడి ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు.

అలవాటుగా సర్వారాయుడు ఇడ్లీప్లేట్ తెచ్చి ముందు పెట్టాడు.

అక్కడే నిలబడి "ఒరేయ్.... టేబుల్ క్లీన్ చేయి!" అని అరిచాడు.

తడిగుడ్డ పట్టుకుని చిన్నా వచ్చాడు.

అందరూ ఇడ్లీప్లేట్లను చేత్తో ఎత్తి పైకి పట్టుకున్నారు.

చిన్నా తడిగుడ్డతో బల్లంతా గట్టిగా రుద్దాడు. ఆ తడిగుడ్డని ఒక ఖాళీగ్లాసులో పిండి ఆ గ్లాసుల్నీ, గుడ్డనీ తీసుకుపోయాడు. వాడు బల్ల తుడుస్తుంటే సుబ్బారాయుడికీ, గణపతికీ ప్రాణం గిలగిల్లాడింది.

తన సూపర్‌విజన్ పూర్తి కావడంతో సర్వారాయుడు వెళ్లిపోయాడు.

"హోటళ్లలో బల్లను శుభ్రము చేయుట అనగా ఒకేచోట ఉన్న మురికిని బల్ల అంతటికీ సమముగా పంచుట"- అని కొత్త నిర్వచనం చెప్పాడు రాజారావు.

ముగ్గురూ నవ్వుకున్నారు.

ఇంక బలిపీఠం ఎక్కక తప్పదనుకుంటూ ఇడ్లీని ముక్క చేయడానికి చెంచాలు తీసుకున్నారు సుబ్బారాయుడు, గణపతి.

"అవునూ... మేమైతే బ్రహ్మచారి ముండావాళ్ళం. హోటళ్ల మీద పడక తప్పదు. నీకేం వచ్చిందీ నిక్షేపంలా మీ ఆవిడ ఉండగా?" అన్నాడు గణపతి.

"నేనూ... ప్రస్తుతం బ్రహ్మచారినే లేవోయ్! మా శ్రీమతి పుట్టింటికి విజయం చేసింది" అన్నాడు రాజారావు.

"అలిగా..?" అని అడిగాడు సుబ్బారాయుడు.

"పండక్కి వెళ్లి వీడు మామ నెత్తిన కూర్చోలేదంటే ఖచ్చితంగా అలిగే!" అన్నాడు గణపతి.

"ఛ... అదేం కాదు. వాళ్ళ పెద్దనాన్న చనిపోతే వెళ్లింది. నేనే దింపి వచ్చాను. మైల రోజులుగా! పండగా, పబ్బం ఏమీలేవు. అందుకని నేను వచ్చేశాను. శుద్ధి అయ్యాక తాను తిరిగి వస్తుంది" అంటూ వివరించి చెప్పాడు రాజారావు.

ప్లేట్లో ఇడ్లీల వంక చూస్తూ-

"ఆహా.... ఇడ్లీలు తెల్లని ఇస్త్రీ మడతల్లాగా ఎంత బాగున్నాయెూ!" అని, "ఇదేమిటి... కేకుల మీద ఐసింగ్ చూశాం కాని, వీళ్ళు ఇడ్లీ మీద కూడా చేసినట్లున్నారు. ఇదుగో... చెర్రీ- చెర్రీ ఎర్రగా ఎలా కనిపిస్తోందో!" అంటూ చెంచాతో ఆ ఎర్రని దాన్ని పైకి తీశాడు.

ఆ చెర్రీని చూస్తుంటే రాజారావు ముఖకవళికలు మారిపోసాగాయి.

దానిని ఆసక్తిగా చూసిన సుబ్బారాయుడు, గణపతిల ముఖాలు పాలిపోయాయి.

అది చెర్రీ కాదు, పాడూ కాదు... బొద్దింక రెక్క!

ముగ్గురూ ముఖాలు చూసుకున్నారు.

"ఇంకా నయం- రెక్కతో సరిపోయింది.., బొద్దింక వచ్చింది కాదు!" అంటూ ఎలాగో రాజీపడి చెంచాతో ఇడ్లీని ముక్కచేసి నోట్లో పెట్టుకుని, ఆ తర్వాత ఛట్నీని నంజుకున్నాడు.

"ఆహా... ఈరోజు ఏదో బొద్దింక రెక్క వచ్చింది కాని, రుచి అంటే ఇక్కడి ఇడ్లీ, ఛట్నీలదే!" అంటూ మరో ముక్కతీసి నోట్లో పెట్టుకున్నాడు.

దానిని నమలబోయేసరికి పళ్లమధ్య ఏదో కసుక్కుమంది.

'ఏమిటా...' అని తీసేసరికి అది సాక్షాత్తూ యవ్వనంలో ఉన్న బొద్దింక శవం! ఈ విన్యాసం అంతా చూస్తున్న మిత్రులిద్దరూ అప్పటివరకు అసలు ఇడ్లీలను ముట్టలేదు.

బొద్దింకని చూసేసరికి ముగ్గురికీ వాంతి వచ్చేసినట్లే అయింది.

ఇంక తినకుండా ఆపేసి బొద్దింక వచ్చిన ప్లేటును పట్టుకుని కౌంటర్ దగ్గరికి వెళ్లి ప్రొ ప్రయిటర్‌తో పోట్లాట పెట్టుకున్నారు.

ఇది ఏదో మామూలు వ్యవహారమయినట్లు, స్థితప్రజ్ఞుడిలాగా నిశ్చలంగా కూర్చుని తన పని తాను చేసుకుపోసాగాడు ప్రొప్రయిటర్.

ఆయన వెనకాల ఇద్దరు జెమాజెట్టీల వంటివారు నిలబడి ఉన్నారు. చేతుల్లో కర్రలు, కత్తులు లేవుకాని, వాళ్ళు రౌడీల మోడల్లో ఉన్నారు.

వారిలో ఒకరు- "ఎంత జాగ్రత్తగా చేసినా చీమో, దోమో, బొద్దింకో పడుతూనే ఉంటాయి. వాటిని పట్టించుకుంటామా? పక్కకు తీసేసి తింటాం కానీ..!" అన్నాడు.

"మీ ఇంట్లో మాత్రం బొద్దింకలు రావూ? తీసుకెళ్లి పెంటకుప్ప మీద పోసేస్తారా? హోటలు అనేసరికి నిలదీసి అడుగుతున్నారు కాని..." అన్నాడు రెండోవాడు.

ఎదురు ప్రశ్నలకు కొయ్యబారిపోయారు ముగ్గురు మిత్రులూ. వారు తేరుకునే లోపలే- "వేరే వాయి ఇడ్లీలు ఇస్తారు తినండి. అదీ వద్దంటే మాట్లాడకుండా వెళ్లిపొండి. తిన్నదానికి డబ్బియ్యనక్కరలేదు" అన్నాడు ప్రొప్రయిటర్ నిశ్చలంగా.

"తిన్నదానికి డబ్బేమిటి? అసలు మేము తింటే కదా!" అన్నాడు గణపతి.

"అయితే ఇంక సమస్యేం ఉంది? మీ సొమ్ము మీ దగ్గర, మా సరుకు మా దగ్గర!" అన్నాడు ప్రొప్రయిటర్ అతి తేలిగ్గా.

"అలా అంటే ఊరుకుంటా మనుకుంటున్నారా? ఇప్పుడే వెళ్లి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కి రిపోర్టు చేస్తాం!" అన్నాడు రాజారావు.

"ఈరోజు పండగ సెలవు. ఆఫీసు ఉండదు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గారు స్పెషల్ రూంలో టిఫిన్ చేస్తున్నారు. మీరు ఇప్పుడే వెళ్లి రిపోర్టు చేయవచ్చు" అన్నాడు ప్రొప్రయిటర్.

"పోదాం రండిరా... ఇటువంటి చోటికి రావడం మనదే బుద్ధి తక్కువ!" అన్నాడు సుబ్బారాయుడు.

"పొండి-పొండి... ఇలా అనేవాళ్ళే మళ్లీ మళ్లీ వస్తుంటారు" అన్నాడు వెనకున్న ఇద్దరిలో ఒకడు.

చేసేది లేక వాళ్ళవైపు, ప్రొప్రయిటర్ వైపూ కొరకొరా చూస్తూ ముగ్గురూ బయటకి వెళ్లిపోయారు.

"మరో హోటల్‌కి వెళ్దాం రండిరా!" అన్నాడు రాజారావు.

"అన్ని హోటల్సూ ఇంతే! ఇంక హోటల్లో తినాలని లేదు" అన్నాడు గణపతి.

"కడుపులో కరకరలాడుతోంది. అయినా హోటల్‌కి పోయి తినాలన్న మూడ్ లేదు. రూంకి పోయి ఏమైనా వండుకుందాం!" అన్నాడు సుబ్బారాయుడు.

ఇలా మాట్లాడుకుంటూ వెళ్తుంటే ఎదురుగా పెద్ద బేకరీ కనిపించింది. అందులో కేక్స్ చాలా స్పెషల్‌గా ఉంటాయి. బిస్కట్లలో కూడా ప్రత్యేక రకాలు ఉంటాయి. అక్కడ ఆ ముగ్గురూ చాలాసార్లే తిన్నారు.

"ఈరోజు హోటల్స్‌లో ఎలాగూ తినలేం. ఈ బేకరీకి పోయి కాసిని బిస్కట్లు, కేకులూ తిని టీ తాగుదాం రండి!" అన్నాడు రాజారావు.

ముగ్గురూ బేకరీలోకి వెళ్లి గుండ్రని బల్ల చుట్టూ కూర్చున్నారు. బిస్కట్లు, కేకులూ తెమ్మని వెయిటర్‌ని ఆర్డరిచ్చాడు రాజారావు.

వెయిటర్ ఒక పెద్ద ప్లేట్లో బిస్కట్లూ, మరొకదానిలో కేకులూ తెచ్చి వాళ్ళ మధ్య పెట్టాడు. ఎవరికి కావలసినవి వాళ్ళు తిన్నాక తిననివి తిరిగి తీసుకుపోయి, తిన్నవాటికి డబ్బు తీస్కుంటాడీ వెయిటర్. ఇది ఇరానీ హోటళ్లలోనూ, కాకా హోటళ్లలోనూ పద్ధతి.

మిత్రులు ముగ్గురూ రౌండ్ బిస్కట్లు లాగించారు. ఆ తర్వాత కేక్స్ మీద పడ్డారు.

"ఆహా... ఎంత తాజాగా ఉన్నాయ్! ఏమి రుచిగా ఉన్నాయ్!" అంటూ లొట్టలు వేశాడు గణపతి. "ఎలాగైనా ముస్లిముల బేకరీల రుచే వేరు!" అన్నాడు రాజారావు.

"అవునవును..!" అంటున్న సుబ్బారాయుడి నోటిలో టపాకాయ పేలినట్లు టక్కున చప్పుడయ్యింది. "అబ్బా..." అంటూ బుగ్గ పట్టుకుని నోట్లోనుంచి దేనినో బయటకు తీశాడు.

అది ఒక పన్ను..!

"ఇదేమిటీ... మెత్తని కేక్ తింటే టక్కున పన్ను ఊడింది?" అన్నాడు గణపతి ఆశ్చర్యంగా.

"పన్ను విరిగినా నెత్తురు రావడం లేదేమిటి?" అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

"ఏమిటీ... నోట్లో ఇంకా ఏదో గట్టిగా ఉంది?! మరో పన్ను విరిగిందా ఏమిటి?" అంటూ నోట్లోంచి కేక్‌ను బయటకు తీశాడు సుబ్బారాయుడు.

దాని మధ్య చిన్న తల కనిపిస్తోంది. పరీక్షగా చూస్తే... అది ఎలుక పిల్ల తల!

"అరే... క్యాడ్‌బరీ చాక్లెట్‌లా ఇది ర్యాట్‌బరీ కేక్ అన్నమాట!" అన్నాడు రాజారావు నవ్వుతూ.

"ఇందాక నువ్వు పౌష్టిక ఆహారం తినలేదూ?!" అని అంటించాడు సుబ్బారాయుడు.

ఆ ఎలుక పిల్ల తల ఉన్న కేక్‌ను తీసుకుని బేకరీ మాలిక్ మీదకి యుద్ధానికి బయలుదేరారు మిత్రత్రయం.

"క్యాహై యే... కేక్‌మే చువా ఆగయా?" అంటూ విరుచుకుపడ్డాడు రాజారావు.

"దానిని కొరికేసరికి మావాడి పన్ను విరిగింది. ఇదుగో... చూడండి!" అన్నాడు గణపతి మొదట వచ్చిన పన్నును చూపుతూ.

మాలిక్ దానిని చూస్తూ- "భలేవారే సాబ్... ఇది చువా కీ దాంత్! ఎలుక పన్ను చూపించి మీ దోస్త్ పన్ను అంటారేమిటి?" అన్నాడు- తెలుగూ, ఉర్దూ కలగలుపుతూ, వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

"నా పన్ను కాదా?" అంటూ నోట్లో వేలుపెట్టి చూసుకున్నాడు సుబ్బారాయుడు. తన పన్ను క్షేమంగా ఉండటం చూసి, "అమ్మయ్యా..." అనుకున్నాడు.

"పన్ను విరగకపోతే మాత్రం? కేకులో ఎలుక రావడమా?" అంటూ గద్దించాడు.

"అది ఎలుక పిల్ల! శక్కర్ తినడానికి చూసి ఉంటుంది- చచ్చూరుకుంది!" అన్నాడు.

ఆ తర్వాత నచ్చచెప్పడాలూ, క్షమాపణలూ వగైరా!

అయితే ఉర్దూలో మర్యాద వాచకాలు ఎక్కువ కనుక లోపల ఉడికిపోతున్నా పైకి మాత్రం ముఖానికి నవ్వు పులుముకుని బయటపడ్డారు.

"ఒరేయ్... ఈరోజు మనకి బాగాలేదు. మనం పండగనాడు బయట తినడం దేవుడికి ఇష్టంలేనట్లుంది. ఇంటికిపోయి వండుకుందాం... పదండి!" అన్నాడు రాజారావు.

"అంతే చేద్దాం!" అన్నాడు సుబ్బారాయుడు. ముగ్గురూ వెళ్తుంటే వినాయక పందిరిలో గంటలు ఘనంగా గణగణ మ్రోగుతున్నాయి.

"ఒరేయ్... దేవుడికి దణ్ణం పెట్టుకుని పోదాం రా!" అన్నాడు గణపతి.

"తప్పుతుందా? అది నీ పందిరేనాయె!" అన్నాడు రాజారావు.

ముగ్గురూ పందిరిలోకి వెళ్లి భక్తుల వరుసలో నిలబడ్డారు.

వినాయకుడి పూజ అయింది. హారతి ఇచ్చాక భక్తులకి ఆవిరి మీద ఉడకబెట్టిన పప్పూ, ఉండ్రాళ్ళూ నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని భక్తులకు పంచారు. మిత్రులు ముగ్గురూ ప్రసాదం తీసుకుని భక్తితో కళ్లకద్దుకున్నారు.

బయటకు వచ్చాక చేతిలో ఉన్న పెసరపప్పును చూస్తూ- "వీళ్ళు ఉత్సవం ఘనంగా చేస్తున్నారు. ఎంతైనా మార్వాడీలు... ఉండ్రాళ్ళలో కూడా ఏలకుల గింజలు వేస్తున్నారు" అంటూ భక్తితో కళ్లకద్దుకుని నోట్లో వేసుకున్నాడు గణపతి.

కొంచెం నమిలాడో, లేదో- "థూ... థూ..!" అంటూ ఉమ్మివేశాడు. నోటిలో మిగిలినదానిని చేతిలోకి తీసుకుని పరీక్షగా చూడసాగాడు. మిగిలిన ఇద్దరు కూడా మెడలు వంచి చూశారు.

"ఒరేయ్- ఇవి ఏలకుల గింజలు కావురా... ఎలుక గొద్దెలు!" అన్నాడు రాజారావు.

షాక్ కొట్టినట్లు చేతిలో ఉండ్రాన్ని క్రింద పడేశాడు గణపతి.

ఆ తర్వాత ముగ్గురూ మౌనంగా ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లారు.

కథ మళ్లీ ఇల్లు చేరింది.

- ఆంధ్రభూమి మాస పత్రిక... ఫిబ్రవరి '97